


Dr.PRK

# పవర్

పోరాడితే పోయిదేమీ లేదు బానిస సంకేళ్ళ తప్ప




సంపుటి : 01 సంచిక : 346 | గురువారం 24 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4

## జూరాల ప్రాజెక్టుకు

# 3 టీఎంసీల నీటి విడుదల

## కర్ణాటక ప్రభుత్వం అంగీకారం








**హైదరాబాద్, పవర్ న్యూస్**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల జలాశయం పరిధిలోని రైతుల సాగునీటి అవసరాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎగువన ఉన్న కృష్ణా జలాలను విడుదల చేయాలని తెలంగాణ ప్రజాప్రతినిధుల బృందం కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల బృందం బుధవారం కర్ణాటక డిప్యూటీ సీఎం (ఇరిగేషన్ మంత్రి) డి.కె. శివకుమార్‌తో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, జి మధుసూదన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో నారాయణపూర్, ఆల్మట్టి జలాశయాల నుంచి జూరాలా ప్రాజెక్టుకు నీటి విడుదల అంశంపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రాంత రైతుల పంటలను కాపాడేందుకు అత్యవసరంగా నీటిని విడుదల చేయాలని కోరగా, దీనికి కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడుతల వారీగా మొత్తం 3 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేసేందుకు డి.కె. శివకుమార్ అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు అధికారులు ఇప్పటికే నీటిని విడుదల చేయడం ప్రారంభించారు.




## బిఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్‌ది

# సంక్షేమ పాలన

### ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో వేల కోట్లు దోపిడి

### పులుసుబొంత ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి

### మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, పవర్ న్యూస్**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ ల పేర్లతో నిర్లక్ష్యం చేసి, వేలాది కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి

..మిగతా 2లో




## రాష్ట్రాలకు ఇన్‌చార్జిల

# నియామకం

### 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు

### తమిళనాడు ఇన్చార్జిగా రామ్ మాధవ్

### కో ఇన్ చార్జిగా డీకే అరుణ నియామకం

### ఒడిసా ఇన్ చార్జిగా పురంధేశ్వరి

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులకు అధిష్ఠానం రాష్ట్రాల బాధ్యతలను అప్పగించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జ్‌లు,కో-ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఏపీకి ఇన్‌ఛార్జ్‌గా అరవింద్ భదౌరియా, తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా సునీల్ భన్సల్, సహ ఇన్చార్జులుగా రేఖ శర్మ, అభయ్ పాటిల్‌లను నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పేరిట బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కూడా

..మిగతా 2లో

## ప్రజా చైతన్య కార్యక్రమాల్లో బహుజన సమాఖ్యను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

**- కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**(వరంగల్ కలెక్టరేట్ -- పవర్, సెప్టెంబర్ 23):** పలు సమస్యల పరిష్కారం కోసం బహుజన కల్చరల్ ఫెడరేషన్ (దీజఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, హనుమకొండ డీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బహుజన కల్చరల్ ఫెడరేషన్ ప్రతినిధులు తమ సమస్యలను డాక్టర్ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించిన డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం తన వంతు విశేష కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం:**

"ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో పాటు సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో కూడా మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం లభించేలా చర్యలు తీసుకునేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను. ప్రజా చైతన్య కార్యక్రమాల్లో బహుజన కల్చరల్ ఫెడరేషన్ వంటి సామాజిక సంస్థలను మరింత భాగస్వామ్యం చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను" అని డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. అలాగే బహుజనులు, వెనుకబడిన వర్గాలు మరియు అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులు సమర్థవంతంగా అందేలా సంబంధిత వర్గాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన కల్చరల్ ఫెడరేషన్ (దీజఫ్) ప్రతినిధులు అశోక్, శరత్, నర్సింగం, కందిక సుధాకర్, కోటేశ్వర్ తదితరులతో పాటు పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్

### ఈ నెల 25న హైదరాబాద్ లో గణేశ్ మహా నిమజ్జనం

### జంట నగరాల పరిధిలో మద్యం విక్రయాలు బంద్

### స్టార్ హోటళ్లు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు

**హైదరాబాద్, పవర్ న్యూస్**




గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు. మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.



# హై అలెర్ట్..!

2లో..

### తీరం దాటిన వాయుగుండం

### మరో రెండు రోజులు వర్షాలు.. 48 గంటల పాటు అప్రమత్తత




## ఐదు రోజులు

# బ్యాంకుల బంద్

### బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం

### సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్

..మిగతా 2లో



# ఇంటిపై పిడుగు.. తప్పిన పెను ప్రమాదం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23**

గద్వాల పట్టణంలోని హమాలీ కాలనీలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉన్న నరేందర్ కుమార్ ఇంటిపై బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ సంఘటన జరిగిన సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్, వార్డు ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే ఇదే ఇంటిపై 3నెలల క్రితం పిడుగుపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## జనసేన తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్‌గా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 23**



జనసేన పార్టీ తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్ గా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు.గతంలో ఉన్న కమిటీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తూ 10 మంది సభ్యులతో సవరించిన జాయినింగ్ కమిటీకి కన్వీనర్ గా ఆయన వ్యవహరిస్తారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అలాగే రాబోయే ఎలక్షన్లలో జనసేన పార్టీ జెండాను ఎగురవేస్తామని దిమా వ్యక్తం చేశారు..



# హై అలెర్ట్..!

**హైదరాబాద్, సెప్టెంబర్ 23**

పశ్చిమమధ్య ,దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 13 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా కదులుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది ప్రస్తుతానికి కళింగపట్నానికి 30 కి.మీ, విశాఖపట్నానికి 90 కి.మీ, గోపాల్‌పూర్‌కు 160 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని వెల్లడించారు. ఇది బుధవారం రాత్రి 11-12 గంటల సమయంలో ఉత్తర కోస్తా -- దక్షిణ ఒడిశా తీర ప్రాంతలైన విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఆర్టీజీఎస్అవేర్-విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో తీవ్ర వాయుగుండంపై క్షేత్రస్థాయిలోని అధికారులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలను జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. తీవ్రవాయుగుండం తీరం దాటినప్పటికి భారీ వర్షాల కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు మరో 48 గంటలు పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున చెట్లు , హోర్డింగ్స్ వద్ద నిలబడరాదన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం శ్రీకాకుళంలో 3, అల్లూరి 2, విశాఖ 2, పోలవరం1, అనకాపల్లిలో ఒకటి మొత్తంగా 5 ఎస్డీఆర్ఎఫ్, 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రభావిత జిల్లాల్లో సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు సమాచారం కోసం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 4250101 సంప్రదించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో 88.2మిమీ, లక్ష్మీనర్సుపేటలో 73.7మిమీ, ఎన్టీఆర్ జిల్లా పుట్రేలలో 67.6 మిమీ, రెడ్డిగూడెంలో 64.1 మిమీ, ఎ.కొండూరులో 62.8మిమీ, ఏలూరు జిల్లా ఏదులగూడెంలో 57 మిమీ, కృష్ణా జిల్లా పెదయెరుకపాడులో 53.7మిమీ , ఎన్టీఆర్ జిల్లా కొర్లమండలో 50.7మిమీ, చందర్ల 49మిమీ, శ్రీకాకుళం జిల్లా మందసలో 44.7మిమీ చొప్పున వర్షాలు నమోదైనట్లు వివరించారు. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి బుధవారం ఉదయం 8:30 గంటల వరకు నమోదైన అత్యధిక వర్షపాతం వివరాలు జిల్లా వారీగా వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో 141మిమీ, అల్లూరి జిల్లా జి.మాడుగులలో 100మిమీ, విశాఖ జిల్లా భీమునిపట్నంలో 97మిమీ, ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో 94మిమీ, పోలవరం జిల్లా కూనవరంలో 91మిమీ, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 89మిమీ, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 80మిమీ, అనకాపల్లి జిల్లా సబ్బవరంలో 78మిమీ, కోనసీమ జిల్లా అయినవిల్లిలో 76మిమీ, మన్యం జిల్లా బలిజిపేటలో 75మిమీ చొప్పున నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

# నాపై మహిళా డ్యాన్సర్లు దాడి చేశారు: పోలీసులకు ఫిర్యాదు చేసిన జానీమాస్టర్ భార్య

**కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలతపై దాడి**
**రఘు మాస్టర్ వర్గం డ్యాన్సర్లు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు**
**'మినిట్స్ బుక్' వివాదంతో మొదలైన గొడవ**
**డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి సుమలత తొలగింపు**
**అక్టోబర్ 11న అసోసియేషన్‌కు కొత్త ఎన్నికలు**



టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత పోలీసులను ఆశ్రయించారు. తనపై కొందరు మహిళా డ్యాన్సర్లు దాడి చేశారని ఆరోపిస్తూ ఆమె బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఆమెను తెలుగు సినిమా డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ ఫిల్మ్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది.కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్‌కు చెందిన మహిళా డ్యాన్సర్లు తనపై దాడికి పాల్పడ్డారని సుమలత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మినిట్స్ బుక్' విషయంలో తలెత్తిన వివాదమే ఈ దాడికి కారణమని తెలుస్తోంది. అయితే, సుమలతే బలవంతంగా మినిట్స్ బుక్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, తాము అడ్డుకున్నామని అవతలి వర్గం ఆరోపిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## బిఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్‌ది సంక్షేమ పాలన

మొదటి పేజీ తరువాయి...

శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.

**మండలంలోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.**

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువు నుంచి 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని,భవిష్యత్తులో అశ్వాపురం మండలంలోని అన్ని ప్రాంతాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పులుసు బొంత ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, అవసరమైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్ ను ఆచరణలోకి తెస్తామని అన్నారు.

**గత పాలకుల స్వలాభం కోసం రీ డిజైన్లు**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే బీఆర్ఎస్ పాలకులు రీ డిజైన్ల పేరుతో వేల కోట్లాది రూపాయలను దండుకునేందుకు.సీతారామ ప్రాజెక్టు ను వారి స్వలాభాలకు ఎలా మార్చుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక మారేళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేశామని, భవిష్యత్తులో అనేక సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కులమతాలకతీతంగా తమ పాలన సాగుతుండగా బీఆర్ఎస్ వారేమో అసెంబ్లీ దళిత స్పీకర్ తల్లి పట్ల అహంకారపూరిత భాషతో మాట్లాడుతుండటం బాధాకరమని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను 3, 4 విడతల్లో కూడా అందజేస్తామని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




## వరసగా ఐదు రోజులు బ్యాంకుల బంద్

మొదటి పేజీ తరువాయి...

సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్ తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రాష్ట్రాలకు ఇన్‌చార్జిల నియామకం

మొదటి పేజీ తరువాయి...

సునీల్ భన్సల్‌కు అప్పగించింది అధిష్ఠానం. స్మృతి ఇరానీ హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇచ్చింది. బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌ల లిస్టులో తెలుగువారికి అవకాశాలు దక్కాయి. సీనియర్ నేత రామ్ మాధవ్ తమిళనాడు బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. సహ ఇన్‌ఛార్జ్‌గా ఎంపీ డీకే అరుణకు అవకాశం కల్పించారు. ఏపీ ఎంపీ పురందేశ్వరికి ఒడిశా ఇన్‌ఛార్జ్‌గా, కర్ణాటక సహ ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లును అధిష్ఠానం నియమించింది.




# గణేష్ నిమజ్జన బందోబస్తుపై వరంగల్ సీపీ విశేష సమావేశం: అధికారులకు కీలక ఆదేశాలు

**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 23):**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా మరియు సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ శ్వేత ఝా గారు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లా ఽ ఆర్డర్, ట్రాఫిక్ మరియు ఇతర విభాగాలకు చెందిన అన్ని స్థాయిల అధికారులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 23 నుండి సెప్టెంబర్ 24 వరకు జరిగే గణేష్ నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై సీపీ గారు అధికారులకు సమగ్రంగా బ్రీఫింగ్ ఇచ్చారు.

**సీపీ గారు జారీ చేసిన కీలక ఆదేశాలు:**

- ముందుస్తు జాగ్రత్తలు: నిమజ్జన శోభాయాత్ర మరియు నిమజ్జన ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన అన్ని ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- శాఖల సమన్వయం: ఇతర సంబంధిత శాఖలు మరియు విభాగాలతో నిత్యం సమన్వయంతో పనిచేస్తూ బందోబస్తును పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.
- ప్రజల సహకారం: ప్రజల సహకారం మరియు చురుకైన భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా ముగించేలా చర్యలు చేపట్టాలని సీపీ గారు స్పష్టం చేశారు.
- ఈ సమావేశంలో వివిధ స్థాయిల పోలీస్ అధికారులు, ట్రాఫిక్ మరియు స్పెషల్ వింగ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ విఘ్నేశ్వర స్వామి చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొన్న 'కుడా' చైర్‌పర్సన్ గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు



**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 23):**

హనుమకొండలోని చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ విఘ్నేశ్వర స్వామివారి చక్రస్నాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం నాటి ఈ వేడుకల్లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖఖణూా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఆలయ ప్రాంగణంలో శ్రీ రుద్రేశ్వర స్వామి వారికి, అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీ గణపతికి వారు పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలోని కోనేరులో శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పలు మండపాల్లో పూజలు, ఉద్వాసన కార్యక్రమాలు:**

అనంతరం హనుమకొండ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్ ఆవరణలో మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు ఏర్పాటు చేసిన శ్రీ గణపతి వద్ద, మడికొండలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద, వరంగల్ బట్టల బజార్ లో బట్టల వర్తక సంఘం వారు ఏర్పాటు చేసిన మండపం వద్ద, అలాగే గాయత్రి కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసిన శ్రీ గణపతి విగ్రహాల వద్ద గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ఉద్వాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మనువాదుల చెర నుండి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

## డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంచు రాజేందర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపు



**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 23):** భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తూ ఆయన రచించిన భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు మతతత్వ శక్తులు పూనుకుంటున్నాయని, వాటిని తిప్పికొట్టి రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుండి రక్షించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చంచు రాజేందర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని వారు తీవ్రంగా హెచ్చరించారు.బుధవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో డీబీఎఫ్ గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంచు రాజేందర్, మాదాసి సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.

**బాబాసాహెబ్‌ను అవమానిస్తే శాస్తి తప్పదు:**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలన్నీ కొనియాడుతుంటే, హమారా ప్రసాద్ లాంటి మనువాదులతో అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడించడం అత్యంత సిగ్గుచేటని మండిపడ్డారు. దేశంలో సమతా రాజ్య స్థాపనకు, సర్వమానవ సమానత్వానికి ప్రాతిపదిక అయిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే శక్తులకు దేశ ప్రజల చేతిలో తగిన శాస్తి తప్పదని స్పష్టం చేశారు. బాబాసాహెబ్ ఆశయ సాధనకు, రాజ్యాంగ పరిరక్షణకు దళిత, బహుజన వర్గాలంతా ఐక్యంగా పోరాడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ఉపాధ్యక్షులు చంచు నరేష్, గ్రామ అధ్యక్షుడు మాదాసి నవీన్, నాయకులు రాజు, సుశీల, రాధ, లక్ష్మి, కొమురయ్య, రాజయ్య, శ్రీకాంత్, కుమారస్వామి, స్వామి, చేరాలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# DCP Central Zone Dara Kavitha Conducts Early Morning Inspections of Ganesh Immersion Points Across Central Zone



**(Hanamkonda – Power, September 23):** To ensure a peaceful, safe, and smooth Ganesh immersion process across the Warangal Central Zone, Central Zone DCP Dara Kavitha IPS conducted extensive field inspections starting early in the morning at around 05:30 AM. The DCP personally visited and reviewed the immersion arrangements at several key water bodies, including Pariki Kunta, Hasanparthy Cheruvu, Bheemaram Cheruvu, Arakasai Kunta, Gopalpur, Gundlasingaram, Chinnawaddepalli, Kattamallanna Cheruvu, Agarthal Fort, Warangal, Bestham Cheruvu, Ursu Ranga Samudram, Siddheshwara Gundam, and Bandam Cheruvu. During the visits, DCP Dara Kavitha supervised the bandobast and logistics in close coordination with officials from concerned government departments and district administration. Instructions were issued to maintain strict vigilance, ensure safety measures near water bodies, and seamlessly manage crowds to facilitate smooth immersions without any untoward incidents. Senior police officials and representatives from various line departments accompanied the DCP during the inspection drive.

# Trial Run Conducted for Dedicated Bus Lane from KPHB to Waverock Under the Leadership of Cyberabad Traffic JCP Supreet Singh



(Hyderabad ▯ Power, September 23): To reduce traffic congestion and ensure faster movement for commuters, Cyberabad Traffic Police under the leadership of Joint Commissioner of Police Supreet Singh IPS conducted a trial run to examine the feasibility of providing a dedicated lane for TGSRTC and IT company buses from KPHB to Waverock. Officials stated that this trial run was carried out as a follow-up to earlier discussions with the Transport Department and TGSRTC. Road and city-planning experts assessed traffic flow and road capacity to enable faster bus movement with minimal stops, particularly during peak hours. The feasibility of measures to reduce traffic congestion on the JNTU to Biodiversity corridor was also evaluated in detail. Cyberabad Traffic Joint Commissioner of Police Supreet Singh IPS, Traffic-2 DCP Sheshadrini Reddy IPS, TGSRTC ED Sridhar, and SCSC CEO Naved Alam Khan, along with other senior officers, were present during the trial run. Power Daily Newspaper District Staff Representative, Irsadla Vamshikrishna



# గూడేప్పాడ్‌లో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ముగింపు వేడుకలు: గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు

**(గూడేప్పాడ్ -- పవర్, సెప్టెంబర్ 23):** గూడేప్పాడ్ గ్రామంలో గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఆఖరి రోజు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. ఉత్సవాల చివరి రోజును పురస్కరించుకుని గణనాథుని మండపం వద్ద యూత్ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహామంగళ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... నవరాత్రుల ఉత్సవాల వేళ గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసిందని, బొజ్జ గణపయ్య దివ్య ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను విజయవంతం చేయడానికి సహకరించిన గ్రామ పెద్దలకు, భక్తులకు, యూత్ సభ్యులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అనంతరం చివరి రోజు గణనాథుడి దివ్య మూర్తి వద్ద గరుడ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు, యువకులు అందరూ కలసి ప్రత్యేక శోభాయాత్రకు సిద్ధమై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గరుడ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, యువకులు, చిన్నారులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి, ఇర్సడ్ల వంశీకృష్ణ**

# ఘనంగా గణపయ్య నిమజ్జనం: గంగమ్మ ఒడికి లంబోదరుడు

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీగా తరలివచ్చిన మహిళలు



**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 23):** ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గత తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శోభాయాత్ర, నిమజ్జనోత్సవాల్లో భాగంగా బొజ్జ గణపయ్యకు భక్తజనం ఘనంగా వీడ్కోలు పలికారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా మహిళలు అత్యంత ఉత్సాహంతో, భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారికి వీడ్కోలు పలకడం విశేషం.

మహిళలంతా సాంప్రదాయ దుస్తులు ధరించి భక్తిగీతాలు, భజనలు మరియు కోలాట నృత్యాలతో నిమజ్జన వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నారు. “గణపతి బప్పా మోరియా... వచ్చే ఏడాది త్వరగా రావయ్యా” అంటూ భక్తులు చేసిన జయజయధ్వానాలు, ఆధ్యాత్మిక నినాదాలతో శోభాయాత్ర వీధులన్నీ మార్మోగిపోయాయి.

సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు:

ఈ సందర్భంగా వివిధ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీల సభ్యులు మాట్లాడుతూ... గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడంలో పూర్తి సహకారాన్ని అందించిన ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు, ప్రజలకు మరియు ముఖ్యంగా వర్షంలోనూ పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల ఐక్యత, ఆధ్యాత్మిక సహకారంతోనే ఈ ఏటి ఉత్సవాలు అత్యంత శోభాయమానంగా ముగిశాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయా ఉత్సవ కమిటీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

**(ములుగు -- పవర్, సెప్టెంబర్ 23):**
11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఆయుర్వేదం మన పురాతన వైద్య విధానమని, గ్రామీణ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా శిబిరాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో, రాబోయే రోజుల్లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.



వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న మారుమూల గ్రామాలకు వైద్య బృందాలు వెళ్లి సేవలు అందించాలని, శిబిరాల తేదీలను ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి, ఎక్కువ మంది ప్రజలు లబ్ధి పొందేలా చూడాలని తెలిపారు. ఈ నెల 27న చిన్నబోయినపల్లిలో జరిగే కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య బృందం తప్పక పాల్గొనాలని ఆదేశించారు.

ఏటూరునాగారంలోని ఆయుర్వేద ఆసుపత్రికి సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఆసుపత్రికి పక్కా భవనాలు, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముత్తారంలో హ్యాట్రిక్ గణపతి లడ్డూను కైవసం చేసుకున్న నాగిళ్ల అరుణ్-జయంతి దంపతులు

**(భీమదేవరపల్లి -- పవర్, సెప్టెంబర్ 23):**
భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని హనుమాన్ల గడ్డ -- పద్మశాలి కాలనీలో శ్రీ గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక స్వామి లడ్డూ వేలం పాట భక్తుల ఉత్సాహం నడుమ అత్యంత కోలాహలంగా జరిగింది. ఈ వేలం పాటలో స్థానిక నాగిళ్ల అరుణ్ కుమార్ -- నాగిళ్ల జయంతి దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గత రెండు సంవత్సరాలుగా స్వామివారి ప్రసాదాన్ని గెలుచుకుంటూ వస్తున్న వీరు, ఈ సంవత్సరం కూడా రూ. 37,516/-ల వేలం పాటతో వరుసగా మూడవసారి (హాట్రిక్) గణపతి లడ్డూను దక్కించుకున్నారు. వరుసగా మూడేళ్లుగా లడ్డూను సొంతం చేసుకోవడంతో ఉత్సవ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు ఆ దంపతులను ఘనంగా అభినందించారు.

ఈ సందర్భంగా శ్రీ గణపతి యువజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... నాగిళ్ల అరుణ్ కుమార్ -- జయంతి దంపతుల కుటుంబంపై శ్రీ గణనాథుని దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆ విఘ్నేశ్వరుడు వారి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. అనంతరం “గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా” అనే భక్తి జైకోశాల నడుమ స్వామివారి దివ్య ప్రసాదాన్ని దంపతులకు అందజేశారు.

---

# గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

**గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25న జీహెచ్ఎంసీ పరిధిలో సెలవు**

**ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా**

**నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో**

**డీజేలు, అసభ్య నృత్యాలపై కఠిన చర్యలని సీపీ హెచ్చరిక**



హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్**

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం ‘షీ టీమ్స్’ నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.



# స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం రంగరాయగూడెం గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**(స్టేషన్ ఘన్‌పూర్ -- పవర్, సెప్టెంబర్ 23)**
రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ రాబడి మార్గాలను అన్వేషించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి మరియు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం రంగరాయగూడెం గ్రామంలో పీఎం కుసుమ్ పథకం కింద స్థానిక రైతు నెలమంచ అజయ్ రెడ్డి ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రసాయన రహిత ఇంధనానికి మరియు సౌర విద్యుత్తుకు పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు. బంజరు భూములు లేదా తక్కువ సాగు విస్తరణ ఉన్న ప్రదేశాల్లో ఈ తరహా ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం ద్వారా రైతులు విద్యుత్ సంస్థలకు విద్యుత్ విక్రయించి స్థిరమైన ప్రత్యామ్నాయ ఆదాయం పొందవచ్చని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు రావడం అభినందనీయమన్నారు. ధైర్యంతో ముందుకొచ్చి ప్లాంట్ నెలకొల్పిన రైతు అజయ్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాలుకుంట్ల శిరీష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ పోలీస్ అధికారి రవీందర్ గారిని పరామర్శించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 23)**
వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు తన స్నేహితుడు మరియు రిటైర్డ్ పోలీస్ అధికారి జి రవీందర్ గారిని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన రవీందర్ గారు కోలుకుని ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు హన్మకొండలోని వారి నివాసానికి వెళ్ళి ఆత్మీయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వారు త్వరగా పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. స్నేహితుడిగా ఆత్మీయంగా మాట్లాడి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరియు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

# సమాజ శ్రేయస్సే ధ్యేయంగా వార్తలు అందిస్తూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి ఇర్సడ్ల వంశీకృష్ణ గారి పాత్రికేయ ప్రయాణం అత్యంత అభినందనీయం

**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 23):**
ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగంలో జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమైనది. గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తగా చేరవేస్తూ పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి ఇర్సడ్ల వంశీకృష్ణ ప్రత్యేక ముద్ర వేశారు. వరంగల్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా ప్రతినిధుల సమావేశాలు, ఆధ్యాత్మిక ఉత్సవాలతో పాటు ప్రజా సమస్యలను సమగ్రంగా వెలుగులోకి తెస్తూ నిజాయితీతో కూడిన వార్తా కథనాలను నిష్పక్షపాతంగా అందిస్తున్నారు.

**ప్రజా సమస్యలపై పోరాటం మరియు సామాన్యుడికి తోడ్పాటు:**
కేవలం రోజువారీ సంఘటనలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాయడంలో వంశీకృష్ణ గారు ఎల్లప్పుడూ ముందుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న, పెద్ద సమస్యలను పరిశీలించి, వాటి తీవ్రతను సమాజానికి, అధికారులకు తెలిసేలా వ్యాసాలు ప్రచురిస్తున్నారు.

**మండలంలో ఇన్నేళ్లుగా ఎవరూ చేయని సాహసోపేతమైన కృషి:**
మండల స్థాయిలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పలు జటిలమైన సమస్యలపై ధైర్యంతో అడుగు ముందుకు వేశారు. ఎవరూ ఊహించని రీతిలో సాహసోపేతమైన కృషి చేపట్టి ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.

**గ్రామాల్లో ప్రతీ వస్తువు ఎంఆర్పీ ధరలకే అమ్మేలా చర్యలు:**
గతంలో ఎవరూ పట్టించుకోని ఎంఆర్పీ రేట్ల ఉల్లంఘనలపై గళమెత్తి, గ్రామాల్లో ప్రతీ వస్తువును నిర్ణీత ధరలకే విక్రయించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చేశారు. దీనివల్ల గ్రామీణ వినియోగదారులు అదనపు భారం లేకుండా సరుకులు కొనుగోలు చేసే వెసులుబాటు కలిగింది.

**నిబంధనలు ఉల్లంఘించిన షాపుల సీజ్ మరియు జరిమానాల విధింపు:**
ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు సరుకులు అమ్మే షాపులపై వరుసగా ప్రత్యేక కథనాలు ప్రచురించి అధికారులతో తనిఖీలు నిర్వహించేలా చేశారు. నిబంధనలు దాటి ప్రవర్తించిన షాపులను సీజ్ చేయించి జరిమానాలు విధించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించారు.

**ఎక్స్‌పైరీ వస్తువుల అమ్మకాలపై ఉక్కుపాదం:**
వ్యాపారులు కాలం చెల్లిన ఎక్స్‌పైరీ వస్తువులను విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా తన కథనాల ద్వారా అడ్డుకట్ట వేశారు. తనిఖీలు ముమ్మరం చేయించి నాణ్యమైన వస్తువులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూశారు.

**రేషన్ దందా మరియు ఉచిత బియ్యం దోపిడీకి చెక్:**
పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న వ్యవహారాలపై మరియు రేషన్ దందాపై నిరంతరం వార్తలు రాసి బియ్యం దోపిడీని అరికట్టడంలో ప్రధాన భూమిక పోషించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు.

**రాజకీయ ఒత్తిళ్లకు లొంగని నైజం:**
పాత్రికేయ వృత్తిలో ఎదురైన ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఏనాడూ వెనకడుగు వేయకుండా నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారు. భయపడకుండా నిజాలను నిష్పక్షపాతంగా సమాజం ముందుకు తెస్తున్నారు.

**ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమై కలెక్టర్ దృష్టికి చేరవేత:**
ఎక్కడ సమస్య ఉంటే అక్కడ తాను ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చి, ఏ చిన్న సమస్య వెలుగులోకి వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు తక్షణ న్యాయం చేకూరేలా చూస్తున్నారు.

**మౌలిక వసతుల సాధనలో ముందంజ:**
విద్యుత్, వైద్యం, రహదారులు, రవాణా సౌకర్యాల వంటి మౌలిక వసతుల లోపాలపై సమగ్ర వార్తలు ప్రచురించి అధికారులు వెంటనే స్పందించేలా చేశారు. గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, తాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు.

**వృత్తి పట్ల నిబద్ధత మరియు పాఠకుల అభిమానం:**
వార్తల్లో ఖచ్చితత్వం, స్పష్టత మరియు నిష్పాక్షికతను పాటిస్తూ పత్రికా విలువలను కాపాడటంలో వంశీకృష్ణ గారు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజా సంఘాల నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉంటూ సమయానుకూలంగా నిజాన్ని మాత్రమే పాఠకులకు అందిస్తున్నారు. వారి విశ్లేషణాత్మకమైన కథనాలు పవర్ దినపత్రికకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా పాఠకుల ఆదరాభిమానాలను సంపాదించిపెట్టాయి.

**పవర్ ప్రత్యేక కథనం**

**ఇర్సడ్ల వంశీకృష్ణ**

**(M.Sc. Chemistry)**



# తెలంగాణలో నేడు, రేపు కుండపోత..

# పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్



**5 జిల్లాలకు రెడ్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**నిన్న పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు**

**పిడుగుపాటుకు వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళల మృతి**

**భద్రాద్రి జిల్లాలో పాఠశాలలకు రెండు రోజులు సెలవులు**

తెలంగాణలో నేడు, రేపు (గురు, శుక్రవారాలు) అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో రోజంతా ముసురు పట్టింది. ఖమ్మం జిల్లా కల్లూరులో అత్యధికంగా 6.28 సెం.మీ వర్షపాతం నమోదైంది. రెడ్ అలర్ట్ జారీ చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. ఇదే జిల్లా బూర్గంపాడు మండలంలో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలు ఇళ్ల పైకప్పులు, హోర్డింగులు ఎగిరిపడ్డాయి. ఈ వర్షాల కారణంగా విషాదకర ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరులో లక్ష్మి (35), జడ్చర్లలో యాదమ్మ (66), పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో అంజమ్మ (55) మృతి చెందారు. పిడుగుపాటు వల్ల మరికొందరు గాయపడగా, పశువులు కూడా మృత్యువాత పడ్డాయి.

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

**హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం**

**లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం**

**మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి**



శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.



# నాని.. నిర్ణయం పోలీసులదే..

- ముందు పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేయండి
- థియేటర్లో ప్యారడైజ్ మూవీ చూడలన్నా హీరో నాని
- అనుమతించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి వినతి






: 'ది ప్యారడైజ్' సినిమాకు సంబంధించి నేచరల్ స్టార్ నాని చేసిన ప్రత్యేక విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. భద్రతా మార్గదర్శకాలను గౌరవించినందుకు నానికి అభినందనలు తెలియజేశారు. యువ తెలంగాణ దర్శకుడు ఓదెల శ్రీకాంత్‌కు ప్రశంసలు కురిపించారు. ప్రజా భద్రత, జనసమూహ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తును పరిశీలించిన అనంతరం పోలీసులు నిర్ణయం తీసుకుంటారని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు. కాగా.. నేచురల్ స్టార్ నాని నటించిన 'ది ప్యారడైస్' సినిమా ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే సందర్భంగా బుధవారం రాత్రి నుంచి ప్రీమియర్ షోస్ ప్రదర్శించనున్నారు. ఈ క్రమంలో 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులతో కలిసి చూసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని నాని కోరారు. అమల్లోఉన్నఅన్నిఅవసరమైన ప్రోటోకాల్స్, భద్రతా మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తామని చెప్పారు. ప్రజల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని, తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని నాని కోరారు.



## మధుబని లుక్‌లో మెరిసిన తమన్నా

### వైరల్‌గా లేటెస్ట్ పిక్స్

సినీ నటి తమన్నా భాటియా తన లేటెస్ట్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. సంప్రదాయ భారతీయ కళా శైలిని ఆధునిక ఫ్యాషన్‌తో మేళవించిన ఈ ప్రత్యేక లుక్‌లో తమన్నా ఎంతో అందంగా కనిపించింది. తమన్నా ధరించిన ప్రకాశవంతమైన పసుపు రంగు దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధుబని కళా శైలిని స్ఫూర్తిగా తీసుకుని రూపొందించిన ఈ దుస్తులపై నీలం, తెలుపు రంగులతో చేసిన సున్నితమైన ఎంబ్రాయిడరీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ హస్తకళను ప్రతిబింబించే డిజైన్ ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ దుస్తులకు జతగా ధరించిన ఫ్లోయింగ్ ప్రింటెడ్ ఓఢ్నా తమన్నా అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. మినిమల్ యాక్సెసరీస్‌తో సింపుల్‌గా కనిపిస్తూనే స్టైలిష్‌గా ఫొటోలకు పోజులిచ్చింది. ఎథీరియల్ ఎలిగెన్స్‌తో మెరిసిపోతున్న తమన్నా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ శైలి, ఆధునిక ఫ్యాషన్ కలయికలో తమన్నా కనిపించిన ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తూ కామెంట్లు చేస్తున్నారు.



### బీచ్‌లో ఫాతిమా సనా షేక్

## గ్లామర్ ట్రీట్..

### మరూన్ బికినీలో మెరిసిన బాలీవుడ్ బ్యూటీ

బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ తన లేటెస్ట్ బీచ్ ఫొటోతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సాయంత్రం వేళ సముద్రపు అలల మధ్య నిల్చొని మరూన్ రంగు బికినీలో స్టైలిష్‌గా పోజులిచ్చింది. డస్క్ లైటింగ్‌లో ఫాతిమా లుక్ మరింత ఆకట్టుకునేలా కనిపించడంతో ఈ ఫొటో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. తన గ్లామర్‌తో పాటు బీచ్ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నట్టుగా కనిపించిన ఫాతిమా ఫొటోకు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. - సినిమా డెస్క్, ఆంధ్రప్రభ

## బ్లాక్ డ్రెస్‌లో రష్మిక గ్లామర్ ట్రీట్..

### స్టైలిష్ లుక్‌తో కుర్రకారు ఫిదా



నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో మెరిసిన ఈ ముద్దుగుమ్మ తన గ్లామర్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ట్రెండీ అవుట్‌ఫిట్‌లో ఎంతో కాన్ఫిడెంట్‌గా కనిపిస్తూ కెమెరాకు వరుసగా స్టైలిష్ పోజులిచ్చింది. బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్‌లో రష్మిక లుక్ మరింత ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సింపుల్ యాక్సెసరీస్‌తో తన లుక్‌ను కంప్లీట్ చేసిన ఆమె.. హెయిర్ స్టైల్, మేకప్ విషయంలోనూ క్లాసీ టచ్ ఇచ్చింది. తన చిరునవ్వుతో పాటు కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఫొటోలకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే రష్మిక.. ఎప్పటికప్పుడు తన ఫొటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటుంది. ఈ క్రమంలోనే బ్లాక్ డ్రెస్‌లో ఉన్న తాజా ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రష్మిక అందం, స్టైల్‌కు నెటిజన్లు ఫిదా అవుతూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి బ్లాక్ డ్రెస్‌లో రష్మిక ఇచ్చిన స్టైలిష్ పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. తన గ్లామర్, ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి నెటిజన్లను ఆకట్టుకుంటూ ఈ బ్యూటీ ఫొటోల్లో మెరిసిపోతోంది.

## షార్ట్ డ్రెస్‌లో రమ్య పసుపులేటి

### తెలుగమ్మాయి పిక్స్ వైరల్

: తెలుగమ్మాయి, నటి రమ్య పసుపులేటి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులనుఆకట్టుకుంటోంది.తాజాగా షార్ట్ డ్రెస్‌లో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా..అవినెటిజన్లదృష్టినిఆకర్షిస్తున్నాయి. షార్ట్ డ్రెస్‌లో రమ్య పసుపులేటి ట్రెండీగా కనిపిస్తోంది. సింపుల్ యాక్సెసరీస్, సహజమైన మేకప్‌తో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంది. కెమెరా ముందు స్టైలిష్ పోజులతో ఫొటోలకు ఫోజులిచ్చింది. రమ్య పసుపులేటి షేర్ చేసిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఆమె లుక్‌పై అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు.





## వెండివర్ణ బ్లౌజ్‌లో రకుల్ మెరుపులు..

### వైట్ ఔట్‌ఫిట్‌లో ఎలిగెంట్ లుక్

రకుల్ ప్రీత్ సింగ్ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. మెరిసే సిల్వర్ బ్లౌజ్‌కు ఫ్లోయింగ్ వైట్ ఔట్‌ఫిట్‌ను జోడించి స్టైలిష్‌గా కనిపించింది. పచ్చలతో కూడిన ఎలిగెంట్ జ్యువెలరీతో తన లుక్‌కు మరింత అందాన్ని జోడించింది. కాన్ఫిడెంట్ పోజులతో కెమెరా ముందు మెరిసిన రకుల్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. - సినిమా డెస్క్, ఆంధ్రప్రభ